క్లుప్తంగా

శ్యామలాంబ సమేత రామ లింగేశ్వరుడి గ్రామోత్సవం



పెడన: స్థానిక శ్రీశ్యామలాంబ సమేత రామ లింగేశ్వర స్వామి దేవస్థానంలో రాఖీ పౌర్ణమిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. తొలుత స్వామివారుల గ్రామోత్సవం మేళ తాళాలు డప్పు వాయిద్యాల నడుమ ఆలయం వద్ద ప్రారంభమైంది. పురవీధులు తిరుగుతూ భక్తుల హారతులను అందుకుంటూ తిరిగి ఆలయానికి చేరుకున్నారు. భండారు ఆనంద ప్రసాద్, కర్ణ మోహన్‌రావు, గొల్లంకి మాధవ, పులి రవి, బట్ట శంకరరావు తదితరులు ఊరేగింపులో పాల్గొన్నారు. మధ్యాహ్నం భారీ అన్న సమారాధాన చేశారు.

చండీ హోమం

పట్టణంలోని పాతపేటలో వేంచేసి ఉన్న శ్రీముత్యాలమ్మ ఘటం(చిన పైడమ్మ)అమ్మవారి తృతీయ వార్షికోత్సవాన్ని, రాఖీ పౌర్ణమిలను పురస్కరించుకుని ఆలయం వద్ద చండీ హోమం చేశారు. మధ్యాహ్నం అన్నసమారాధన జరిగింది.

మతసామరస్యానికి ప్రతీక జెండా పండుగ

నాగాయలంక: కృష్ణానది తీరంలోని ఆరో వార్డు నాగుల్‌మీరావలి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో 46వ వార్షికోత్సవం, నాగుల్ మీరా జెండా పండుగ శనివారం కోలాహలంగా నిర్వహించారు. అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ చిలకలపూడి పాపారావు మాట్లాడుతూ మతసామరస్యానికి ప్రతీకగా జెండా పండుగ నిలుస్తుందన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ పాపారావు, దివిసీమ గ్రామీణ యువజన వికాస సమితి అధ్యక్షుడు వెంకట్రామ్(రాజా) ప్రత్యేక పూజ జరిపారు. పలువురు నేతలు పాల్గొన్నారు.

నేడు ఆయుర్వేద ఉచిత వైద్యశిబిరం

మచిలీపట్నంటౌన్: నగరంలోని యోగ ప్రభ ఆయుర్వేద సూపర్ స్పెషాలిటీ హాస్పటల్ ఆధ్వర్యాన నగరంలోని 45 డివిజన్ సచివాలయం వద్ద ఈ నెల 10వ తేదీ ఆదివారం ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శనివారం తెలిపారు. ఈ సందర్భంగా వైద్య శిబిర కరపత్రాలను ఆవిష్కరించారు. ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు నిర్వహించే ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాన్ని వినియోగించుకోవాలని కోరారు. యోగ ప్రభ శ్రీ వైద్యశాల డాక్టర్ ముత్తేవి కృష్ణమాచార్యులు, డాక్టర్ ముత్తేవి రాజా రవి కిరణ్ ఆధ్వర్యంలో సయాటికా, మెడ నొప్పి, డిస్క్, నరాల సమస్యలకు, కీళ్లవాతం, మోకాళ్ల నొప్పులకు, అన్ని రకాల చర్మవ్యాధులకు ఉచిత వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా పంపిణీ చేస్తారని వివరించారు. షుగర్, బీపీ పరీక్షలు ఉచితంగా చేస్తారని తెలిపారు. కరపత్రాలను ఆవిష్కరించిన వారిలో 45 డివిజన్ టీడీపీ ఇన్‌చార్జ్ పీవీ ఫణి కుమార్, డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.

పీఎన్‌టీ ల్యాబ్ ప్రారంభం



పెనమలూరు: కానూరు సిద్ధార్థ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో శనివారం పొజిషనింగ్, నావిగేషన్ అండ్ టైమింగ్ ల్యాబ్‌ను (పీఎన్‌టీ) ఏపీ ప్రభుత్వ ఐటీ, ఎలక్ట్రానిక్స్ ప్రత్యేక కార్యదర్శి డాక్టర్ సుందర్‌బాలకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక పరిశోధనలకు ల్యాబ్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీ రూరల్ రోడ్ ప్రాజెక్టు మేనేజర్ పీవీ రమణమూర్తి, ఐఐటీ తిరుపతి ప్రాజెక్టు డైరెక్టర్ ప్రొఫెసర్ రోషన్ శ్రీవాస్తవ్, వైస్‌చాన్సలర్ వెంకటేశ్వరరావు, ప్రో వైస్ చాన్సలర్ డాక్టర్ ఏవీ రత్నప్రసాద్, ఐటీ విభాగాధిపతి ఎం. సునీత, సీఎస్ఈ విభాగాధిపతి రాజేశ్వరరావు, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

వాహనచోదకులకు ఇబ్బంది లేకుండా చర్యలు



గుడివాడరూరల్: ఈ నెల తొమ్మిది నుంచి 22వ తేదీ వరకు గుడివాడ–ముదినేపల్లి రోడ్డులో మల్లాయపాలెం వద్ద ఉన్న భీమవరం రైల్వే ట్రాక్ మరమ్మతుల నేపథ్యంలో గేటు మూసివేయడంతో వాహనచోదకులకు ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకున్నామని గుడివాడ తాలూకా ఎస్ఐ ఎన్.చంటిబాబు శనివారం తెలిపారు. బంటుమిల్లిరోడ్డులోని దొండపాడు కాల్వ వద్ద వాహనాల రాకపోకలను వేర్వేరు మార్గాల ద్వారా తరలించేందుకు సిబ్బందితో కలసి ఆయన పర్యవేక్షించారు.



మర్రిపాలెం వంతెన వద్ద ఇలా..



భావదేవరపల్లి మెయిన్‌రోడ్డుపై ఇనుప చక్రాల ట్రాక్టర్



లక్ష్మీపురం, చింతలమడ రోడ్డు మధ్యలో గొయ్యి

రహదారులు ఇలా.. వెళ్లేదెలా!

నాగాయలంక, చల్లపల్లిలో మలుపులు, కల్వర్టుల వద్ద ఇబ్బందికర పరిస్థితులు

నాగాయలంక: నియోజవర్గంలో పలుచోట్ల రోడ్లు అధ్వానంగా మారి కనిపిస్తున్నాయి. రహదారులపై గోతులు పడి, కొన్నిచోట్ల రోడ్లు వేయకపోవడంతో ఇబ్బందికరంగా మారుతున్నాయి. నాగాయలంకలో మర్రిపాలెం వంతెన సమీపంలో అవనిగడ్డ మెయిన్ రోడ్డు రోజు రోజుకూ అధ్వానంగా మారుతోంది. మరోవైపు ఇక్కడ నుంచి నాగాయలంక గ్రామంలోకి వెళ్లే తూర్పు బజారు సిమెంట్ రోడ్డు మొదట్లో కల్వర్ట్ వద్ద కుంగుతోంది. కల్వర్ట్ నిర్మాణానికి పూర్తిగా పగలగొట్టిన సిమెంట్ రోడ్డు మళ్లీ వేయకుండా వదిలేయడంతా ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. వాహనాల తాకిడితో ఈ రోడ్డుగా భారీ గోతులుపడి మరింతగా కుంగిపోతోంది. వర్షం పడితే ఈ పరిస్థితి మరింత అధ్వానంగా, బురదమయం అవుతుండటంతో గ్రామస్తులు, వాహనచోదకులు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. అటు విరిగిపోతున్న తారురోడ్డు గురించి ఆర్ అండ్ బీ అధికారులు, ఇటు గుంతలు పడి జారిపోతున్న సిమెంట్ రోడ్డు గురించి పంచాయతీ వారు పట్టించుకోక పోవడంతో ఈ రోడ్డు ప్రమాదకరంగా మారింది.

భావదేవరపల్లిలో..

వ్యవసాయ సీజన్ ప్రారంభం కావడంతో మండలంలోని పలు అంతర్గత రహదారులు, ప్రధాన మార్గాలు ట్రాక్టర్ల ఇనుప చక్రాల కింది నలిగిపోవడంపై ఇలా అయితే ఇక రోడ్లు రోడ్లు ఎలా? అంటూ సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. అసలే అంతంతమాత్రంగా ఉన్న అంతర్గత రోడ్లపై ట్రాక్టర్లు దమ్ముచక్రాలతో స్వైరవిహారం చేస్తున్నాయి. రోడ్లు పూర్తిగా శిథిలమవడమే కాకుండా సిమెంట్ రోడ్లు సైతం బురద దారులుగా మారుతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాస్తవానికి వ్యవసాయ సీజన్‌కు ముందుగానే సంబంధిత ట్రాక్టర్ల యజమానులను మండల పోలీస్ అధికారులు పిలిపించి నిబంధనలపై అవగాహన కలిగించడంలో విఫలం కావడంతో ఇష్టా రాజ్యంగా ఇనుప చక్రాలతో రహదారులపై ట్రాక్టర్‌లు యథేచ్ఛగా తిరుగుతున్నాయి. రోడ్లపై తిరగాలంటే ఇనుప చక్రాలకు రక్షణ తొడుగులు తగిలించాల్సి ఉండగా ఏ ఒక్కరూ పాటించడం లేదు. పోలీసులు ఇప్పటికైనా అవసరమైన చర్యలు తీసుకోవాల్సి ఉంది.



ఇనుప చక్రాల ట్రాక్టర్ వెళ్లడంతో చోడవరం రోడ్డు దుస్థితి

లక్ష్మీపురం, చింతలమడ రహదారిలో..

చల్లపల్లి: మండల పరిధిలోని లక్ష్మీపురం, చింతలమడ రహదారిపై గుంత పడి ప్రమాదకరంగా మారింది. రబ్బీస్ గ్రావెల్‌తో వేసిన రోడ్డు కావడంతో ఇప్పటికే రాళ్లు మొనలుతేలి రాకపోకలకు ఇబ్బంది కల్గిస్తున్నాయి. దీనికితోడు రోడ్డు మధ్య భాగంలో లోతైన గుంత పడింది. మలుపు తిరిగే ప్రదేశం వద్ద ఉండటంతో మరింత ప్రమాదకరంగా మారింది. ఏ మాత్రం ఆదమరిచినా ప్రమాదాలకు అవకాశముంది. విద్యుత్ దీపాలు కూడా సక్రమంగా లేకపోవడంతో రాత్రిళ్లు పాదచారులు, సైక్లిస్టులు గుంత కనిపించక పడపోయే ప్రమాదం ఉంది. ఏప్రిల్ నెలలో జరిగిన మారెమ్మ ఉత్సవాల సందర్భగా లక్ష్మీపురం పంచాయతీ రూ.2 లక్షలతో రోడ్డుకు మరమ్మతులు చేయించినట్లు ప్రచారం చేసుకున్నారు. తూతూ మంత్రంగా పనులు చేసి చేతులు దులుపుకోవడంతో రోడ్డుపై రాళ్లు మొనలుదేలి ఉండటంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని చింతలమడ వాసులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాల్సి ఉంది.

రాజ్యాధికారంతో దళితుల అభ్యున్నతి

అవనిగడ్డ: దళితులకు రాజ్యాధికారం దక్కినప్పుడే ఎస్సీ, ఎస్టీ, బీసీ సామాజిక వర్గాల అభ్యున్నతి సాధ్యమవుతుందని ఆంధ్రా యూనివర్సిటీ పొలిటికల్ సైన్స్ విభాగం హెచ్‌ఓడీ డాక్టర్ గోవాడ వీర్రాజు అన్నారు. అవనిగడ్డలో రిటైర్డ్ టీచర్ నీలా శ్యామ్యూల్ ఇంటి వద్ద రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా దళితులు ఎదుర్కొంటున్న సమస్యలపై శనివారం చర్చా వేదిక నిర్వహించారు. ప్రొఫెసర్ డాక్టర్ వీర్రాజు మాట్లాడుతూ దళితులకు రాజ్యాధికారం దక్కాలంటే రాజకీయ శక్తిగా ఎదగాలని ఆ దిశగా వారిని చైతన్యం పొందాలన్నారు. దీనికి మేధావి వర్గంతో గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరముందన్నారు. గ్రామీణ స్థాయిలో చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. తొలుత 8వ వార్డులోని భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్, మాజీ ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అమెరికాలో ఉంటున్న నీలా జయకర్ ఫోన్‌లో తన సందేశం వినిపించారు. మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు దోవా గోవర్ధన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆంధ్రా విశ్వవిద్యాలయం జియో ఇంజినీరింగ్ విభాగం ఆచార్యుడు డాక్టర్ నీలా విక్టర్ బాబు, ఎస్‌బీఐ విశ్రాంత మేనేజర్ నాదెళ్ల అరవింద్ కుమార్, సామాజికవేత్త మత్తే నాగరాజు, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ అనిల్ తదితరులు పాల్గొన్నారు.



అవనిగడ్డలో అంబేడ్కర్, బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహాల వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

వంతులవారీ విధానంలో సాగునీరు

ఇరిగేషన్ ఈఈ రవికిరణ్

కోడూరు: దివిసీమలోని తీరప్రాంత మండలాలైన కోడూరు, నాగాయలంకకు సంబంధించిన వరి పొలాలకు వంతులవారి విధానంలో సాగునీటిని అందించనున్నట్లు ఇరిగేషన్ ఈఈ రావిళ్ల రవి కిరణ్ తెలిపారు. శనివారం మండలంలోని నార్త్ చానల్ 11వ నంబర్ పంటకాలువకు వెళ్లే నీటి సరఫరాను రైతులతో కలిసి పరిశీలించారు. సాగునీటిని పూర్తిస్థాయిలో అందించేందుకు అన్ని చర్యలు తీసుకున్నట్లు ఈఈ చెప్పారు. రైతులు సమతుల్యత పాటించడంతో పాటు దిగువకు నీటిని పంపేందుకు ఎగువ రైతులు కూడా సహకరించాలన్నారు. ప్రస్తుతం వర్షాభావ పరిస్థితుల కారణంగా సాగు మొత్తం కాలువ నీటి మీదే ఆధారపడి ఉందని, దీంతో వంతుల వారీ విధానానికి శ్రీకారం చుట్టినట్లు చెప్పారు. తీరప్రాంత పొలాలకు కూడా నీటిని సరఫరా చేసేందుకు సిబ్బంది పని చేస్తున్నారని, సకాలంలో వరినాట్లు పూర్తవుతాయని తెలిపారు. ఇటీవల ఉల్లిపాలెంలో ట్యాంకర్‌లో నీటితో తడిపిన రైతు వరినారుమడిని పరిశీలించారు. పీసీ కమిటీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు, ఇరిగేషన్ డీఈ గణపతి, ఏఈ విజయకుమార్, నీటి సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.



ఉల్లిపాలెం వద్ద పొలాలను పరిశీలిస్తున్న ఇరిగేషన్ అధికారులు

పౌర్ణమి సందర్భంగా హోమాలు

చల్లపల్లి/నాగాయలంక/కృత్తివెన్ను: రాఖీ పౌర్ణమి సందర్భంగా మండల పరిధిలోని శ్రీకృష్ణ సాయి ధ్యాన మందిరంలో శనివారం లక్ష్మీగణపతి హోమం, దత్త హోమాలు నిర్వహించారు. పలువురు దంపతులు హోమాలు చేశారు. ఆలయ ట్రస్ట్ చైర్మన్, రిటైర్డ్ ఆర్డీవో నాదెళ్ళ శివ రామకృష్ణ, పురిటిగడ్డ మాజీ సర్పంచ్ పి.సురేష్, ఎస్.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. నాగాయలంక, కృత్తివెన్నులో రాఖీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. నాగాయలంక పరిధిలో పలుచోట్ల సమరసతా సేవాఫౌండేషన్ నేతృత్వంలో రాఖీలు కట్టారు.

గూడూరు: అన్నా చెల్లెల్ల అనుబంధానికి ప్రతీకైన రాఖీ పౌర్ణమి వేడుకలను గూడూరులో శనివారం పలు గ్రామాల్లో ఘనంగా జరుపుకొన్నారు.



పురిటిగడ్డలోని శ్రీకృష్ణసాయి ధ్యాన మందిరంలో హోమాలు చేస్తున్న భక్తులు

ఆరోగ్య విజ్ఞానం చేరువ చేయటమే లక్ష్యం

మెడికల్ కళాశాల డైరెక్టర్ జనరల్ డాక్టర్ చదలవాడ

గన్నవరం రూరల్: ఆరోగ్య విజ్ఞానం అందరికీ చేరువ చేయడమే లక్ష్యమని చిన అవుటపల్లి డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాల డైరెక్టర్ జనరల్ డాక్టర్ చదలవాడ నాగేశ్వరరావు అన్నారు. శనివారం కళాశాలలో 6వ రోజు మెడికల్ అండ్ హెల్త్ ఎగ్జిబిషన్‌ను మూడు వేల మంది సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ శరీరంలోని అవయవాలు, పని తీరు, చెడు అలవాట్లతో వాటిని పాడు చేసుకుంటున్న విధానాలపై డిజిటల్ అవగాహన కల్పిస్తున్నామన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ భీమేశ్వర్ మాట్లాడుతూ హెల్త్, మెడికల్ ఎగ్జిబిషన్‌లకు ప్రజలు, విద్యార్థులు, యువత, మహిళల నుంచి విశేష స్పందన లభించిందన్నారు. ఎన్నో సేవా కార్యక్రమాలు అకాడమి సొంతం చేసుకుందని, ఈ మహత్తర కార్యక్రమంతో మరిన్ని సమాజ సేవ కార్యక్రమాలు నిర్వహించాలన్న సంకల్పం బలపడిందని చెప్పారు. డైరెక్టర్ డాక్టర్ సీవీరావు, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ బి.అనిల్‌కుమార్, డెప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ కె.కల్యాణి, హెచ్‌వోడీలు, ఏవోలు, డాక్టర్ రాజగోపాల్ పాల్గొన్నారు.

డెంటల్ కళాశాలలో..

చిన అవుటపల్లి డాక్టర్స్ సుధా అండ్ నాగేశ్వరరావు సిద్ధార్థ దంత వైద్య కళాశాలలో ఎక్స్ ఫ్లోర్–25 పేరిట 6వ రోజు ఎగ్జిబిషన్‌ను వేలాది మంది సందర్శించారు. ప్రిన్సిపాల్ ఎంవీ రామోజీరావు ఆధ్వర్యంలో దంత వైద్యంలో 9 విభాగాలు ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయగా సందర్శకులకు వైద్యులు దంతాల ప్రాముఖ్యత వివరించారు. హెచ్‌వోడీలు డాక్టర్ కాశేశ్వరరావు, అజయ్ బెనర్జీ, ఏవో వై.మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.



ఎగ్జిబిషన్‌లో సందర్శకులకు వివరిస్తున్న డాక్టర్



న్యూరాన్ స్ట్రక్చర్ విద్యార్థులకు వివరిస్తున్న దృశ్యం

అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలి

గుడివాడ టౌన్: అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్ల సమస్యలు ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ కృష్ణా జిల్లా కార్యదర్శి ఎ.రమాదేవి డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో యూనియన్ జిల్లా మహాసభలు జరిగాయి. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, కనీస వేతనం అమలు చేయాలని, ఐసీడీఎస్ బడ్జెట్ పెంచి ఉద్యోగుల ఆర్థిక ఇబ్బందులు తొలగించాలని కోరారు. కార్మిక కోడ్‌లను రద్దు చేయాలని, సుప్రీంకోర్టు ఉత్తర్వుల ప్రకారం ఆధార్ ధ్రువీకరణ, ముఖ గుర్తింపు వంటి యాప్‌లను తొలగించి లబ్ధిదారులకు పౌష్టికాహారం అందజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు ఎం. స్వర్ణలత, కోశాధికారి ఎ.నాగమణి, రాష్ట్ర కమిటీ సభ్యురాలు కె. కృష్ణవేణి, గుడివాడ అధ్యక్ష కార్యదర్శులు వై. గీత, టి. వాణి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి రమాదేవి

చిన ఓగిరాల వద్ద రోడ్డు ప్రమాదం

కంకిపాడు: రోడ్డు ప్రమాదంలో బాలిక గాయాలపాలైంది. అటుగా వెళ్తున్న కంకిపాడు ఎస్ఐ డి.సందీప్ ప్రమాదాన్ని గుర్తించి మానవత్వాన్ని చాటారు. ప్రమాదానికి గురైన బాలికను హుటాహుటిన ఆసుపత్రికి తరలించి వైద్యం అందించేలా చేశారు.

వివరాల్లోకి వెళితే.. పమిడిముక్కల మండలం గడ్డిపాడు గ్రామానికి చెందిన తుమ్మలపల్లి శ్రీనివాసరావు, తన భార్య, కుమార్తె చరిత (12)తో స్కూటీపై విజయవాడ నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా చిన ఓగిరాల వద్ద స్కూటీ వెనుక టైరు పంక్చర్ అయ్యింది. దీంతో వాహనం అదుపుతప్పి కిందపడిపోయారు. ప్రమాదంలో చరితకు తీవ్ర గాయాలయ్యాయి. అటుగా వెళ్తున్న ఎస్ఐ డి.సందీప్ ప్రమాదాన్ని గుర్తించి గాయాలపాలైన చరితను పోలీసు వాహనంలోనే ఉయ్యూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి సకాలంలో వైద్యం అందేలా చర్యలు తీసుకోవటంతో అందరూ అభినందించారు. బాలిక ఆరోగ్య పరిస్థితి స్థిరంగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు.



ప్రభుత్వాస్పత్రికి బాలికను తీసుకెళ్తున్న ఎస్ఐ సందీప్

ఇన్‌చార్జిలే దిక్కు!

- బందరు సర్వజన ఆస్పత్రిలో పూర్తిస్థాయి సూపరింటెండెంట్ లేక ఇన్‌చార్జిల పాలన
- వైద్య సేవల నాణ్యతలో అవరోధం.. అత్యవసర నిర్ణయాల్లో ఆలస్యం
- ఆరోగ్యశాఖ స్పందించకపోవడంపై తీవ్ర విమర్శలు

మచిలీపట్నం అర్బన్: కృష్ణా జిల్లాలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి పరిపాలన పూర్తిగా ఇన్‌చార్జిలపై ఆధారపడింది. పది నెలలుగా పూర్తిస్థాయి సూపరింటెండెంట్ లేకపోవడంతో, ఆస్పత్రి పరిపాలన నానాటికీ క్షీణిస్తోంది. నియమితుడైన డాక్టర్ మన్మథరావు బాధ్యతలు స్వీకరించకపోవడం పరిపాలనా లోపానికి నిదర్శనంగా ఉంది.

సూపరింటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరించని పరిస్థితి

విశాఖపట్నం కేజీహెచ్‌లో సర్జన్ గా విధులు నిర్వర్తిస్తున్న డాక్టర్ మన్మథరావుకు మూడు నెలల క్రితం పదోన్నతి కల్పించి ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి సూపరింటెండెంట్‌గా నియమించారు. ఆయన ఇప్పటి వరకు ఆయన బాధ్యతలు చేపట్టలేదు. ప్రభుత్వ యంత్రాంగం ఎటువంటి చర్యలు తీసుకోలేదు. ఆస్పత్రి ఇన్‌చార్జి అధీనంలో ఉంది.

వైద్య సేవలపై ప్రభావం

ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుందరాచారి ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా బాధ్యతలు నిర్వర్తించగా, అనంతరం డాక్టర్ జి. భానుమూర్తి, డాక్టర్ డి.ఆశాలత బాధ్యతలు తీసుకున్నారు. కూటమి ప్రభుత్వం పూర్తిస్థాయి సూపరింటెండెంట్ నియమించకపోవడంపై వైద్యసిబ్బంది అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ఇన్‌చార్జిపై భారం

ప్రస్తుతం సూపరింటెండెంట్ ఇన్‌చార్జిగా డాక్టర్ డి. ఆశాలత పదవీ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఆమెపై ఇప్పటికే మూడు కీలక బాధ్యతలు ఉన్నాయి. మెడికల్ కాలేజీ అనాటమీ విభాగం హెడ్‌గా, మొదటి సంవత్సరం మెడికల్ కాలేజీ వైద్య విద్యార్థులకు బోధనతో పాటు వైద్య కళాశాలలో అడ్మినిస్ట్రేటివ్ వైస్ ప్రిన్సిపాల్‌గా కూడా ఆమె బాధ్యతలు నిర్వహిస్తున్నారు. దీంతో ఆసుపత్రిలో సూపరింటెండెంట్ స్థాయిలో నిత్య పరిపాలన, అత్యవసర నిర్ణయాలు తీసుకోవడంలో తడబాటు తలెత్తుతోంది.

ఆర్థిక పరిపాలనలో అంతరాయం

ఆస్పత్రిలో బిల్లుల ఆమోదం, వైద్య సామగ్రి కొనుగోళ్లు, అత్యవసర సేవల నిర్వహణ వంటి కీలక విభాగాల్లో తీవ్రమైన లోపాలు ఏర్పడుతున్నట్లు వైద్య సిబ్బంది చెబుతున్నారు. పూర్తి స్థాయి అధికారుల నియామకాలు లేకపోవటంతో రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం శాశ్వత అధికారిని వెంటనే నియమించి బాధ్యతలు స్వీకరింపజేయాలని వైద్య సంఘాలు, సిబ్బంది ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.



మచిలీపట్నంలో ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి

సేవలపై అంకితభావం



ప్రజలకు నిరంతర వైద్య సేవల అందుబాటులో ఉండేలా నా స్థాయిలో అన్ని బాధ్యతలు నిబద్ధతతో నిర్వహిస్తున్నాను. పదోన్నతి పొంది సూపరింటెండెంట్‌గా నియమితులైన డాక్టర్ మన్మథరావు పదోన్నతిని తిరస్కరించినట్లు సమాచారం ఉంది. శాశ్వత అధికారిని ప్రభుత్వం త్వరగా నియమిస్తే పరిపాలనా పని మరింత సమర్థంగా సాగుతుంది.

–డాక్టర్ డి.ఆశాలత, ఇన్‌చార్జి సూపరింటెండెంట్, బందరు సర్వజనాస్పత్రి

ఘనంగా స్వామివారి శాంతి కల్యాణం



బంటుమిల్లి: స్థానిక పద్మావతీ గోదా సమేత వెంకటేశ్వరస్వామి వారి వార్షిక శాంతి కల్యాణం శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. పవిత్రోత్సవాల ముగింపులో భాగంగా ఉదయం స్వామి వారికి, అమ్మవార్ల ప్రధాన మూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కల్యాణాన్ని కనులపండువలా నిర్వహించారు. మధ్యాహ్నం అన్న సమారాధన జరిగింది. కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఎస్.రాజా, జె.వాసుదేవరావు, సీహెచ్ రాధాకృష్ణ, యూపీఆర్ విఠల్ తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న భక్తులకు అన్నసమారాధన

గుడ్లవల్లేరు: డోకిపర్రు భూ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవాల్లో భాగంగా స్వామిని దర్శించుకునేందుకు శనివారం భక్తుల సందడి అధికమైంది. భక్తులు తమ మొక్కులను భక్తి ప్రపత్తులతో తీర్చుకున్నారు. ఈ సందర్భంగా భక్తులకు భారీ అన్నసమారాధనను నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మెయిల్ ప్రతినిధి పురిటిపాటి వీరారెడ్డి, విజయలక్ష్మి దంపతుల చేతుల మీదుగా ప్రారంభించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా విఖనస మహర్షి జయంతి



దావాజిగూడెం(గన్నవరం): మండలంలోని దావాజిగూడెంలో సీతారామచంద్ర స్వామి దేవస్థానంలో శనివారం శ్రీవిఖనస మహర్షి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. తొలుత ఆలయ అర్చకుడు ఎస్.రామాచార్యులు నేతృత్వంలో విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం చేశారు. అనంతరం శ్రీవిఖనస స్వామివారికి పంచామృత స్నపన, విశేష అర్చనలు నిర్వహించారు. నూతన వటువులకు సామూహిక ఉపాకర్మలు జరిపారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై శ్రీవిఖనస స్వామికి అత్యంత వైభవంగా శోభయాత్ర నిర్వహించారు. దావాజిగూడెం, గన్నవరంలో గ్రామోత్సవం అనంతరం శోభయాత్ర తిరిగి ఆలయానికి చేరుకుంది. అనంతరం వైఖానస యూత్ ఫోరం ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాద వితరణ జరిపారు.

వైభవంగా పెన్నేరమ్మ వార్షిక సంబరం



ఘంటసాల: ఘంటసాలలో గ్రామ దేవత శ్రీ పెన్నేరమ్మ 83వ వార్షిక గ్రామ సంబర మహోత్సవం శనివారం భక్తి శ్రద్ధలతో వైభవంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా అమ్మ వారికి పంచామృత అభిషేకం, నూతన వస్త్రధారణ, ఘటానికి నదీస్నానం ఆచరింపజేశారు. అనంతరం గ్రామోత్సవం చేసి మొక్కుబడులు చెల్లించుకున్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.